క్లుప్తంగా

మిథున్‌రెడ్డికి స్వాగతం పలికిన చెల్లుబోయిన



ఎంపీ మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన ఎంపీ మిథున్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు సోమవారం స్వాగతం పలికారు. మిథున్‌రెడ్డికి బెయిల్ రాగానే అమలాపురం నియోజకవర్గం నుంచి అనేక మంది పార్టీ నాయకులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలివెళ్లి ఆయనకు మద్దతుగా నిలిచారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

ముమ్మిడివరం: యువత మత్తు పదార్థాల జోలికి పోకుండా తరచూ పర్యవేక్షిస్తూ తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై డి.జ్వాలా సాగర్ సూచించారు. కొత్తలంకలో సోమవారం డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వంటి కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి గోపాలకృష్ణ,తోలేటి రాంబాబు, నడిమింటి సూర్యప్రభాకరం, గీశాల చంద్రరావు, గేదెల రఘునాథబాబా, గుత్తుల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

అమలాపురం టౌన్: ఎస్పీ రాహుల్ మీనా సోమవారం అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ పి.వీరబాబు ఎస్పీకి స్టేషన్‌లోని పట్టణ మ్యాప్‌ను చూపించి నేరాలను నిరోధించేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌తో ఎస్పీ పలు అంశాలపై చర్చించారు. పట్టణ ఎస్సైలు ఎస్ఆర్ కిషోర్‌బాబు, టి.శ్రీనివాస్, మనోహర్ జోషికి పలు సూచనలు చేశారు.

వంతెన మెట్ల పునర్నిర్మాణానికి చర్యలు

యానాం: కురసాంపేట సరిహద్దులో నందీశ్వర ఆలయం వద్ద ఉన్న యానాం ప్రధాన వంతెన మెట్లు ఇటీవలి కూలిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారనే ఫిర్యాదు నేపథ్యంలో సోమవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పీడబ్ల్యూడీ అధికారులతో కలిసి పరిశీలించారు. మెట్లను పునర్నిర్మించేందుకు రూ.2లక్షలు విరాళంగా అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ నాగరాజు, జ్యోతిరాజు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శత జయంత్యుత్సవం

ఐ.పోలవరం: గుత్తినదీవిలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గుత్తినదీవి ఉప మండలం ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొలుత కాషాయ ధ్వజానికి పూజలు నిర్వహించారు. దుర్గాదేవి, భారత మాత, మాధవ్ సదాశివరావు గోల్వాల్కర్ గురూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. రాజమండ్రికి చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకారిణి సభ్యులు ఓలేటి సత్యనారాయణ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవి ఆర్ఎస్ఎస్ శత జయంత్యుత్సవాలపై ప్రసంగించారు.

వైద్యుడు సత్యనారాయణ మూర్తి సేవలు మరువలేనివి

తాళ్లరేవు: ఇంజరం పరిసర ప్రాంత ప్రజలకు పేదల వైద్యునిగా పేరుగాంచిన దివంగత దుడ్డు సత్యనారాయణమూర్తి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఇంజరం వీవీఆర్ కల్యాణ మండపంలో కాకరపర్తి వెంకట్రావు అధ్యక్షతన సత్యనారాయణమూర్తి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓలేటి రమణమూర్తి, దాట్ల దేవదానం రాజు, ద్విభాష్యం నగేష్‌బాబు, వేగేశ్న భాస్కరరాజు, తాతపూడి ప్రసాదరావు తదితరులు సత్యనారాయణమూర్తి సేవలను కొనియాడారు. ఎంబీబీఎస్ చదివి సొంత ఊరి ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో సుమారు 50 ఏళ్లపాటు తక్కువ ఫీజుతో వైద్యం అందించిన మహోన్నత వ్యక్తి సత్యన్నారాయణ మూర్తి సేవలు మరువలేనివని ప్రసంశించారు. సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఎన్.విశ్వనాథం, ఆకెళ్ల నాగేశ్వరరావు, ఎం.సత్యనారాయణమూర్తి, చంటి, ఓలేటి బంగారేశ్వర శర్మ, సీఎస్ఆర్ కృష్ణమూర్తి, కాకరపర్తి సుబ్రహ్మణ్యం, చేదూరి అరవింద్, పాలంకి సుబ్బరాయశర్మ పాల్గొన్నారు.

చెట్టు పట్టా లబ్ధిదారుల నిరసన

అమలాపురం రూరల్: ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో చెట్టు పట్టా లబ్ధిదారులను ఇరిగేషన్ అధికారులు, అగ్రకులాలు రైతులు కొన్నేళ్లుగా ఇబ్బంది పెడుతున్నారని కలెక్టరేట్ వద్ద బాధితులు నిరసన తెలిపారు. లొల్ల గ్రామంలో కాలవ గట్టున పట్టాలున్న దిగుమర్తి రాజారావు, దువ్వ స్వామయ్య, గాలింకి నాగేశ్వరావు, గాలింకి సుబ్బారావు, సవరపు యేసేబు, రాయి నాగేష్ తదితర కుటుంబీకులకు చెట్టు పట్టా పథకంలో పెంచుకున్న చెట్ల సంరక్షణకు స్థానిక రైతులు అధికారుల అండతో అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని జేసీతిని బాధితులు కోరారు.



అమలాపురం కామాక్షీ పీఠంలో సామూహిక సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు



భట్నవిల్లి విజయదుర్గ అమ్మవారికి పెన్నులతో అలంకరణ



సన్నవిల్లిలో సరస్వతీదేవి అలంకరణలో కనకదుర్గ అమ్మవారు

అమ్మవారి ఆలయాల్లో సామూహిక సరస్వతీ పూజలు

అమలాపురం టౌన్: దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో మూల నక్షత్రం సందర్భంగా కామాక్షీ అమ్మవారు సరస్వతీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. పీఠంలో వందలాది మంది విద్యార్థులు సామూహిక సరస్వతీ పూజలో పాల్గొన్నారు. పీఠం ఉత్తరాధికారి విఘునస రాఖీ ప్రేమ్ ఆధ్వర్యంలో పీఠం బ్రహ్మ గోవిందవజ్ఝుల నాగేంద్ర భాస్కర్ శర్మ సామూహిక సరస్వతీ పూజలు చేయించారు. పీఠం చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ, పీఠం ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, ట్రస్టీలు వీరా నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యనారాయణ, మేనేజర్ మర్రి దుర్గారావు పాల్గొన్నారు. అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతులు సోమవారం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్సీ త్రిమూర్తులుకు స్వాగతం పలికారు.

సరస్వతీ దేవిగా..

ముమ్మిడివరం: నియోజకవర్గంలో దసరా శరన్నవ రాత్ర మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు సోమవారం అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముమ్మిడివరంలో కుమ్మర్లవీధి, మార్కెట్ సెంటర్, మెయిన్‌రోడ్డు, రాజుపాలెం, క్రాప చింతలపూడి, సోమిదేవరపాలెం, అయినాపురం, పల్లవారిపాలెం, గోదసివారిపాలెం, లక్ష్మిదేవి లంక, మార్కెట్ సెంటర్ అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చినకొత్తలంకలో అమ్మవారి ఆలయంలో సుమారు 100 మంది విద్యార్థులతో సరస్వతీదేవి పూజ చేయించారు.

అమలాపురం రూరల్: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆలయాల్లోని అమ్మవార్లను సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. బండారులంక నారాయణరావుపేటలో అరటి మామిడితోటలో 300 మంది విద్యార్థులతో సరస్వతి పూజ నిర్వహించారు. దాతలు సమకూర్చిన పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పండ్లు చిన్నారులకు అందించారు. భట్నవిల్లి విజయదుర్గ, ఇమ్మిడివరప్పాడులో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ సన్నిధిని గోగులమ్మ సరస్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో పాలకనకదుర్గ ఆలయంలో సోమవారం సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మండలంలోని ఆలయాల్లో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

ఉప్పలగుప్తం: దసరా ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో సోమవారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. సన్నవిల్లిలో కనకదుర్గ అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు.

కామేశ్వరి అమ్మవారికి..

ఐ.పోలవరం: మండలంలోని పలు గ్రామాల్లోని కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో సోమవారం విద్యార్థులతో సరస్వతీదేవి పూజ నిర్వహించారు. కేశనకుర్రులోని కామేశ్వరి అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు చేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారికి రజత చీరను అలంకరించారు. దాత తమ్మి రత్నం అందజేసిన రజత చీరను అర్చకుడు యనమండ్ర సుబ్బారావు అలంకరించారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సరస్వతీదేవిగా దర్శనం

యానాం: స్థానిక రీజెన్సీ స్కూల్లో సరస్వతీదేవి పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థులు పూజ చేశారు.దొమ్మేటిపేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు.టీచర్ దొమ్మేటి కృష్ణార్జునుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ఆహార కల్తీని అడ్డుకోండి

- రోడ్డు ఆక్రమణలను ఉపేక్షించవద్దు
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే



అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: పట్టణంలో విచ్చల విడిగా జరుగుతున్న ఆహార కల్తీలను పట్టించుకోవాలని, పట్టణంలో ఇళ్ల ముందు మొక్కల పెంపకం పేరుతో మున్సిపల్ స్థలాల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే పలు సమస్యలపై చర్చించారు. పట్టణంలో జరుగుతున్న ఆహార కల్తీ అంశాన్ని పట్టించుకోరా? అంటూ ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ధ్వజమెత్తారు. పట్టణంలో పాలు తదితర ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతున్నా మున్సిపల్ అధికారులు తనిఖీలు చేయడంలేదని ఆరోపించారు. దీనిపై కమిషనర్ సమాధానమిస్తూ మున్సిపాలిటీకి ఫుడ్ సేఫ్టీ అధికారి లేరని, అయినప్పటికీ కల్తీ ఆహారాలపై తనిఖీలు చేస్తామన్నారు.

టిడ్కో దరఖాస్తుదారులకు బకాయిలు చెల్లించాలి

అమలాపురానికి సంబంధించి బోడసుకుర్రు వద్ద ఇచ్చిన టిడ్కో ఇళ్లకు సంబంధించి కొంతమంది లబ్ధిదారులను అనర్హులుగా పేర్కొన్నప్పటికీ వారి వద్ద నుంచి వసూలు చేసిన సొమ్ము బకాయిలను నేటికీ ఇవ్వకపోవడంపై ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రశ్నించారు. త్వరలోనే సొమ్ము చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందు మొక్కలు పెంపకం పేరుతో మున్సిపల్ స్థలాలను, రోడ్లను ఆక్రమిస్తున్నారని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. మున్సిపల్ స్థలాల ఆక్రమణను అడ్డుకోవాలని ఆయన సూచించారు.

అద్దెల బకాయిల వసూళ్ల నిర్లక్ష్యంపై కౌన్సిల్ మండిపాటు

పట్టణంలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పలు షాపుల అద్దెల బకాయిల వసూళ్లపై జరుగుతున్న నిర్లక్ష్యంపై పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు రెవెన్యూ విభాగం అధికారులపై ధ్వజమెత్తారు. పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, యేడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరావు ఈ విషయమై చర్చకు తెరతీసి అధికారుల తీరుపై మండిపడ్డారు. రెండు లేదా మూడు షాపులను లీజుకు తీసుకుని ఒక షాపునకే అద్దె చెల్లిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై దృష్టి సారించాలని సూచించారు. సర్క్యులర్ బజార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో కొన్ని షాపులకు కొందరు లీజుదారులు టు లెట్ బోర్డులు పెట్టడంపై కౌన్సిలర్లు అభ్యంతరం చెప్పారు. మున్సిపల్ సిబ్బందితో తనిఖీ చేయించి టు లెట్ బోర్డులను తక్షణమే తొలగించే ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ పట్టణంలో డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులు పూర్తయ్యాయని ప్రకటించిన వెంటనే కౌన్సిలర్ పడాల శ్రీదేవితో పాటు పలువురు కౌన్సిలర్లు స్పందించి ఇంకా తమ వార్డుల్లో పనులు పూర్తి కాలేదని అన్నారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్‌లు అజెండాలోని పలు అంశాలపై జరిగిన చర్చల్లో మాట్లాడారు.

అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని గత కౌన్సిల్ సమావేశంలో ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టౌన్ ప్లానింగ్ అధికారి పనితీరుపై 17వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశ మందిరంలో సోమవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ అక్రమ లేఅవుట్లపై ప్రశ్నించారు. కమిషనర్ రవివర్మ మాట్లాడుతూ భవన నిర్మాణాలు అముడా పరిధిలో అనుమతులు మంజూరవుతున్నాయని, దీనిపై ఎల్‌టీపీలను మీరు ఎలా అనుమతి ఇస్తున్నారని అడిగినా వారి నుంచి సరైన సమాధానం రాలేదని వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలేదని కౌన్సిలర్ సత్య శ్రీనివాస్ నిలదీశారు. కమిషనర్ రవివర్మ, కౌన్సిలర్ సత్యశ్రీనివాస్ మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ జోక్యం చేసుకుని వారిని వారించారు. 7వార్డు కౌన్సిలర్ గంజా శ్రీనివాసరావు చెత్త సమస్యలను వివరించారు. ఈసమావేశంలో కౌన్సిలర్లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ అధ్యక్షతన ఈకార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు హాజరయ్యారు. ఆలయ చైర్మన్‌గా దాట్ల రామకృష్ణంరాజు, పాలకవర్గ సభ్యులుగా పెద్దింటి మారుతీ శ్రీవాణి, పెన్మత్స రామరాజు,త్సవటపల్లి నాగేంద్రరావు, కర్రి చంద్రశేఖర్, విత్తనాల సత్యనారాయణ, గంగుల జయలక్ష్మి, గొల్లవిల్లి సునీత, పాటి సీతామహలక్ష్మి, మద్దాల వెంకటేశ్వరావు, ఎక్స్ అఫీషియోగా పేటేటి వీర వెంకట సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు.

భూముల రీసర్వేకు సహకరించాలి

తాళ్లరేవు: ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పంపన రామకృష్ణ కోరారు. సోమవారం పి.మల్లవరం పంచాయతీలో రీసర్వే గ్రామసభ, అవగాహన ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వీరబాబు రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, తాళ్లరేవు సొసైటీ అధ్యక్షుడు విల్ల వీర, నీటి సంఘం అధ్యక్షుడు మొగలితుర్తి శ్రీనివాస్, ఆర్ఐ రామకృష్ణ, మండల సర్వేయర్ నిరంజన్‌రావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పొన్నాడ పరామర్శ

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ శివారు మూలకొంపలు గ్రామంలో సబ్బతి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ ముమ్మిడివరం నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ తదితరులు పరామర్శించారు. వార్డు సభ్యుడు సబ్బతి రామకృష్ణ కుమారుడు సబ్బతి అరవింద్ (20) ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పొన్నాడ పరామర్శించి ఓదార్చారు. సర్పంచ్ పంపన రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ నాయకులు వెంటపల్లి నూకరాజు, దడాల జగదీశ్వరరావు, మట్టపర్తి లోవరాజు, దున్నా రాంబాబు, మోర్త శ్రీనివాస్, శీలం గోవిందు, బళ్ల దుర్గాప్రసాద్, తులసి, కూరాటి శ్రీకృష్ణ, కామాడి భైరవమూర్తి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న తాలింఖానా సన్నాహక ప్రదర్శనలు

అమలాపురం టౌన్: దసరా ఉత్సవాల ఊరేగింపు కోసం అమలాపురం పట్టణంలో ఏడు వీధుల్లో ఒకటైన మహిపాల వీధి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చెడీ తాలింఖానా సన్నాహక ప్రదర్శనలు స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. మహిపాలవీధి చెడీ తాలింఖానా 170 ఏళ్ల చరిత్రలో నాలుగో తరమైన అబ్బిరెడ్డి సోదరులు సురేష్, నరసింహరావు, మల్లేష్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనలు ఉత్కంఠంగా సాగాయి. చెడీ తాలింఖానా గురువు అబ్బిరెడ్డి మల్లేష్ పలు విన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, మహిపాల వీధి ప్రతినిధులు బండారు రామమోహనరావు, మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో బిందుశ్రీ ప్రతిభ



అవార్డు అందుకున్న బిందుశ్రీ

యానాం: తమిళనాడు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 28 వరకు దిండిగల్‌లో నిర్వహించిన 44వ సబ్‌జూనియర్, 71వ సీనియర్ జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో జార్జిపేటకు చెందిన క్రీడాకారిణి ఇసుకపట్ల బిందుశ్రీ విశేష ప్రతిభ కనబరిచి 5 వసారి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును కైవసం చేసుకున్నారు. సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్ విభాగంలో ద్వితీయస్థానాన్ని, టీమ్‌ఈవెంట్‌లో తృతీయ స్థానాన్ని సాధించింది. అసోషియేషన్ అధ్యక్షుడు ఇసుకపట్ల అంబేడ్కర్, కార్యదర్శి పి అజయ్, ట్రెజరర్ అత్తిలి సూర్యకుమారి తదితరులు బిందుశ్రీని అభినందించారు.

తాగునీటి ఎద్దడిని తీర్చండి

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని పేదాంధ్రపేటలో ఐదేళ్లుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు పలు మార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని నేలపాటి ఏడుకొండలు, ఇసుకపట్ల విజయ్‌కృష్ణ, మెండు శ్రీనువాస్, జల్లి లోవప్రసాదు, కందిరి దుర్గారావు, జాలెం రమేష్ కోరారు.

ఎల్ఐసీ ఏఓఐ అధ్యక్షుడిగా వీరభద్రరావు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం డివిజన్ ఎల్ఐసీ ఏజెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఏఓఐ) నూతన అధ్యక్షుడిగా అమలాపురం బ్రాంచికి చెందిన సానబోయిన వీరభద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏఓఐ రాజమహేంద్రవరం డివిజన్ సమావేశం ఈనెల 27న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగింది. ఈ సమావేశంలో వీరభద్రరావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరభద్రరావుతోపాటు గౌరవాధ్యక్షుడిగా డీఎస్‌వీడీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డి.రమేష్‌కుమార్, కోశాధికారిగా కె.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అమలాపురం బ్రాంచి యూనియన్ కార్యదర్శి జి.వినాయకరావు, యూనియన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన వీరభద్రరావును సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. బ్రాంచి మేనేజర్ సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ మధుబాబు, ఎల్ఐసీ డవలప్‌మెంట్ ఆఫీసర్ల సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వీరభద్రరావును సత్కరించి అభినందించారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

అమలాపురం రూరల్: కేంద్రం ప్రకటించిన వస్తు సేవలు పన్ను తగ్గింపు జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యాపార సంఘాలు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి జీఎస్టీ సంస్కరణలను వివరించారు. తగ్గింపు రేట్ల ప్రదర్శన బోర్డులు దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 25 నుండి అక్టోబర్ 19 వరకు ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ సీహెచ్ రవికాంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలు వివరించారు. వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ జగన్‌మోహన్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవర ప్రసాద్, ముఖ్య సలహాదారుల నల్లాపవన్, కంచిపల్లి అబ్బులు, గోల్డ్ మార్కెట్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, కుప్పాల రామకృష్ణ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గుండె ఆరోగ్యంపై ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్యులు, వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: గుండె వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశ్రాంత డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గంధం రామం సూచించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్థానిక చంద్రబాబు ఆర్యోగ ఉద్యానవనం (పార్కు)లో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో గుండె సమస్యలపై అవగాహన సదస్సులో డాక్టర్ రామం మాట్లాడారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ పీఎస్ శర్మ గుండె సమస్యలు - పరిష్కారాలపై మాట్లాడారు. అంతర్జాతీయ వాకర్స్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర,వాకర్స్ చీఫ్ కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ, కోశాధికారి పడాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రైవేటీకరణను రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అమలాపురం రూరల్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని, కామనగరువు మెడికల్ కళాశాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. వైద్య కళాశాల ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో కామనగరువు మెడికల్ కళాశాల, కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నిషాంతికి వినతిపత్రం అందించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టి బత్తుల తులసిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు, దళిత శ్రీ శక్తి మహిళా సంఘం నాయకురాలు కొంకి రాజామణి, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్యను కొనసాగించాలని కోరారు. వైద్య విద్యను పీపీపీ పద్ధతిలో నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60, 40 శాతం వాటాతో నిర్మించిన ఈ భవనాలను ప్రైవేట్ వారికి 60 ఏళ్లకు లీజుకు ఇవ్వాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎ.రవి, వై.రాజేష్, జీవీ రమణ,గద్ల వెంకటేశ్వరరావు, టీ.నాగవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్థల పట్టాలు ఇవ్వాలని కలెక్టరేట్ వద్ద ధర్నా

అమలాపురం రూరల్: అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు నక్కా రామేశ్వరంలో మత్స్యకారులు ప్రభుత్వం ఇచ్చిన డి- పట్టా భూముల బాధితులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. 1994లో అప్పటి ఆర్డీవో ఉషారాణి 1662 సర్వే నంబర్‌లో తమ గ్రామంలోని 58 మందికి డి- పట్టా ఏక్‌సాల్ లీజ్ కింద భూములు ఇచ్చారని వారు తెలిపారు. ఆనాటి నుంచి కొంత మంది తమ వద్ద నుంచి పట్టాలను లాక్కుని లబ్ధిదారుల పేర్లు మార్చి అనధికారికంగా చెరువులు తవ్వించి ఆక్వా సాగు చేస్తున్నారని ఆరోపించారు. కనీసం లీజు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పట్టాలు ఇప్పించాలని వారు కోరారు. మత్స్యకార సంఘ నాయకుడు చెక్కా ఆంజినేయులు, పంతాడి సత్యనారాయణ, అంగాడి విష్ణు, మల్లాడి నరేష్, అంగాడి గోవిందు, కొపనాతి కాళికేశ్వరి, కర్రి ధనలక్ష్మి, అంగాడి అన్నపూర్ణ పాల్గొన్నారు.

ప్రజాసంఘాల నాయకుల మధ్య ఘర్షణ

అమలాపురం రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను రద్దు చేయాలని కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ఆందోళన అనంతరం ఇరువురు ప్రజాసంఘాల నాయకులు మధ్య ఘర్షణకు చోటుచేసుకుంది. అమలాపురం నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు పాలమూరు మోహన్‌బాబు, అయినవిల్లి మండలం మాల మహానాడు నాయకులు గిడ్డి వెంకటేశ్వరరావు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొంత మంది సొంత ప్రయోజనాల కోసం ఉద్యమాలు చేస్తున్నారని వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించడంతో మోహన్‌బాబు వాగ్వాదానికి దిగాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి ఒకరిపై ఒకరు దాడి చేశారు. వామపక్ష నాయకుడు కారేం వెంకటేశ్వరరావు, కొంకి రాజమణితోపాటు పోలీసులు వారిని వారించి అక్కడి నుంచి పంపించివేశారు.